క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: మండలంలోని ఐతోల్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ నిర్మాణ పనులు చేపడుతునట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఐతోల్, అంతారం, గోవిందాయిపల్లి, బలాన్‌పల్లి, శిర్సవాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంత వేలం వాయిదా



చారకొండ: మండలంలోని జూపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన గొర్రెల, మేకల సంత వేలం వాయిదా పడినట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ పేర్కొన్నారు. గత సంవత్సరం కన్నా తక్కువగా వేలం పాట పలకడంతో సంత వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో వేలం తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, వినోద్, గణేష్ తదితరులు ఉన్నారు.

కొలువుదీరిన పీర్లు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్, కుప్పగండ్ల, చెర్కూర్, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో పీర్ల చావడిలో పీర్లను ప్రతిష్ఠించారు. మొహరం వేడుకల్లో భాగంగా పీర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 14న చిన్న సరిగెత్తు, ఈనెల 16న రాత్రి పెద్ద సరిగెత్తులను నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో స్వాగత బోర్డులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీర్ల చావిడీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కార్మిక వ్యతిరేక నాలుగు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పర్వతాలు, వెంకటయ్య పాల్గొన్నారు.

డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులు కేటాయించాలి

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన ప్రాంత ఏజెన్సీ పోస్టులు కేటాయించిన తర్వాతనే డీఎస్సీ పరీక్ష నిర్వహించాలని ఆదివాసి చెంచు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పాఠశాలలో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

గోరింటాకు సంబరాలు



మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం మహిళలు గోరింటాకు సంబరాలు నిర్వహించుకున్నారు. గ్రామంలోని మహిళలు ఒక దగ్గరకు చేరుకుని ఒకరికొకరుగా గోరింటాకును అలంకరించుకున్నారు. ఆషాఢమాసంలో గోరింటాకు సంబురాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ అని మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు సుమతి, హరిత, శోభ, అనిత, జయమ్మ, సాలమ్మ, పద్మజా, దీపిక, మంజుల, ప్రభావతమ్మ, లావణ్య, తదిదతరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు జరిగాయని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ గోవిందరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో నిబంధనలకు విరుద్ధంగా చేశారని పేర్కొన్నారు.

విద్యార్థి ఉన్నత విద్య కోసం మంత్రి భరోసా

తాడూరు: మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన సాయికిరణ్‌గౌడ్ ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లేందుకు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యను వివరించారు. ఉన్నత విద్య కోసం రూ.10 లక్షలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి పరుశరాములుగౌడ్‌తోపాటు మాజీ ఎంపీటీసీ రమేష్, కుర్వ యాదవ సంఘం నాయకులు లింగంలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎండుతున్న పంటలు

- వర్షం కోసం రైతులు ఎదురు చూపులు



పెద్దకొత్తపల్లిలో వాడిపోతున్న జొన్నపంట

పెద్దకొత్తపల్లి: వానాకాలంలో తొలకరి పలకరింపుతో రైతులు వ్యవసాయ భూములను దున్ని పంటలను సాగు చేశారు. వానాకాలం రోహిణి కార్తెలో మాత్రామే వర్షాలు కురవడంతో వర్షాలు కుర్వడంతో రైతులు మొక్కజొన్న, పత్తి, కందులు, జొన్నలు, వానాకాలం పంటలను సాగు చేశారు. ఈ సంవత్సరం వర్షాలు ఆశజనకంగా ఉంటాయని అనుకున్న ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. గత నెల 10 వ తేదీ వరకు అడపదడపా వర్షాలు కురిసాయి. కాని అప్పటినుంచి ఇప్పటివరకు వరుణులు మొహం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు కళ్ల ముందు వాడుతుండటంతో దిగాలు పడుతున్నారు.

సాగు వివరాలు

మండల వ్యాప్తంగా మొక్కజొన్న 4251 ఎకరాలు, పత్తి 725 ఎకరాలు, కందులు 101, జొన్నలు 18 ఎకరాలలో రైతులు సాగు చేశారు. నీటి వసతి ఉన్న రైతులు స్పింక్లర్‌ల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. నీటి వసతి లేని రైతులు పంటలు ఎండిపోవడంతో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. పలు గ్రామాల్లో రైతులు పూజలు చేస్తున్నారు.

మొక్కజొన్న ఎండుముఖం పట్టింది



వానాకాలంలో ఐదు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా. గత నెల నుంచి వర్షాలు కురువకపోవడంతో మొక్కజొన్న పంట ఎండుముఖం పట్టింది. 20 రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచేస్తున్నా. కాని ఇప్పటివరకు కురవులేదు. పంటను రక్షించేందుకు నీటి వసతి లేదు.

– బక్కన్న, రైతు, పెద్దకొత్తపల్లి

ముందుగా సాగు చేశాం



వచ్చే యాసంగిలో రెండో పంట మినుము పంట వేసుకునేందుకు ఈ ఏడాది జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురవడంతో మూడు ఎకరాలలో మొక్కజొన్న సాగుచేశా. వానలు రాకపోవడంతో పంట ఎండుతోంది. ఏం చేయాలో అర్థంకావడం లేదు. వరణుడి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

– ఎల్లయ్య, రైతు పెద్దకొత్తపల్లి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లిలో చెంచు ఈశ్వరమ్మను బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈశ్వరమ్మ కుటుంబానికి 10 ఎకరాలు భూమి ప్రభుత్వం ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ వినతి పత్రం ఇచ్చారు. దోషులను అరెస్టు చేసి శిక్షించాలని, చెంచుల భూములు తీసుకున్న వారిపై చట్ట రీత్య చర్యతీసుకోవాలని సీపీఎం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. చెంచు మహిళలు ఇండ్లు, భూములు ఇవ్వాలని చెంచులు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మహేష్, తో పాటు ఐటీడీఏ అధికారులు, చెంచులు ఉన్నారు.

మన్ననూర్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను నల్లమలకు చెందిన ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు యశ్వంత్, పవన్‌లు హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా నల్లమలకు చెందిన పలు విషయాల గురించి చర్చించారు.

వడ్డెరల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



పెద్దకొత్తపల్లి: వడ్డెరల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వడ్డెర సంఘం మండల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వడ్డెరుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఇటీవల పదవి విరమణ పొందిన వడ్డెర ఎంపీటీసీలు వెంకటయ్య, మాధవి, మల్లేష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కురుమూర్తి, పెద్ద కురుమయ్య, వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్, మల్లేష్, మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి రాజు, నరేష్, వెంకటస్వామిలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



నాగర్‌కర్నూల్ రూరల్: దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి. రామయ్య మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, వాటి పరిష్కారం కోరుతూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేస్తున్నా.. ప్రభుత్వాలు ఏమి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామనడం వారి శ్రమను దోచుకోవడమే అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రకళ, కార్మికులు యాదమ్మ, వెంకటమ్మ, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు సబ్సిడీ ద్వార ఉచిత సిలిండర్‌ను అందజేయాలని, డబుల్‌బెడ్‌రూంలు ఇవ్వాలని, కేజీటూపీజీ నిర్బంధ విద్య అమలు చేయాలని కోరారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృత్తి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు శంకర్‌గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, కార్యవర్గ సభ్యులు నర్సింహ, శివుడు, విజయుడు, చంద్రమౌళి, కుద్బుద్దీన్, లక్ష్మీపతి, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత



ఉప్పునుంతల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థి ఎండీ సమీరా బాసర త్రిపుల్ ఐటీలో సీటు సంపాదించింది. ఈ మేరకు బుధవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రూ. 10 వేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు



పంజుగూలలో ఉపాధ్యాయిలను భుజాలపై మోస్తున్న పూర్వ విద్యార్థులు

చారకొండ: మండలంలోని జూపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు వెంకటస్వామి, కోట్యా నాయక్, తులసిరాం నాయక్, సంపూర్ణలు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. బుధవారం పాఠశాలలో వారిని హెచ్ఎం ఝాన్సీరాణి, విద్యార్థులు వీడ్కోలు పలికారు. అదేవిధంగా పాఠశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు అమరేందర్ రావు, విజయేందర్ గుప్తా, నారాయణ, అల్లాజి, రాఘవేందర్‌లను బదిలీ అయిన ఉపాధ్యాయులు సన్మానించారు.

కోడేరు: మండలంలోని రాజాపూర్ పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కొములయ్య, వెంకటప్ప, శ్రీకాంత్‌రెడ్డిలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులు ప్రభాకర్, శ్రీశైలం, శ్రీలత, మహేష్‌లకు స్వాగతం పలికారు. భాస్కర్‌శర్మ జీహెచ్ఎంగా పదోన్నతి పొందాడు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు కృష్ణయ్య, పాండయ్య, తిరుపతమ్మలను విద్యార్థులు భుజాలపై మోసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను పాటపాడుతూ కొనియాడారు. హెచ్ఎం ఎల్లయ్య గౌడ్ ఉపాధ్యాయులు పుష్పలత, ఉమాదేవి, రామేశ్వరయ్య, గణేష్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకం



బిజినేపల్లి: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం పదోతరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సహకాలు అందజేశారు. అధిక జీపీఏ సాధించిన విద్యార్థులను రూ.1116 నగదుతో పాటు మెడల్, సర్టిఫికెట్‌ను బుధవారం ప్రదానం చేశారు. పాలెం జీడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి విజయలక్ష్మి పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షలో 1200వ ర్యాంకు సాధించడంతో రూ.5000 ఆర్థికం సాయం అందించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన అన్ని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని డివిజనల్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ వరకు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం బుధవారం కొనసాగింది. అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్‌లలో పరిధిలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయులకు 8, 9వ తేదీల్లో శిక్షణ ఇచ్చారు. 10, 11 తేదీల్లో కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ డివిజన్‌ల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌వీ గోమతి తెలిపారు. 1, 2 తరగతులకు బోధించే ఉపాధ్యాయులు విధిగా పాల్గొనాలని కోరారు.

నవోదయ విద్యాలయ అభివృద్ధికి చేయూత

బిజినేపల్లి: మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి చేయూత నిచ్చారు. ప్రధాన ద్వారం, సెక్యూరిటీ గదులను నిర్మించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మురళీకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జానకిరాములు, పూర్వ విద్యార్థి ప్రతినిధులు రంజిత్, రాధిక, జ్యోతి, గోవర్ధన్, శ్రీహరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కిసాన్‌సెల్ అధ్యక్షుడు



వెల్దండ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాదులో అయన నివాసంలో బుధవారం మండలం గుండాల గ్రామానికి చెందిన కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వినతిపత్రం అందజేశారు.

కర్నూల్ ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

అచ్చంపేట రూరల్: అచ్చంపేట నుంచి కర్నూల్‌కు గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని అర్థాంతరంగా రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట పలువురు ప్రయాణికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎం స్పందించి వెంటనే కర్నూల్ వైపు బస్సులను పునరుద్ధరించాలని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

డీఎస్సీ వాయిదా వేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో నిరుద్యోగుల భవిష్యత్ కోసం వెంటనే డీఎస్సీ వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ, మరోవైపు టీఎస్పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూపు 1, గ్రూపు 2, డీఎస్సీ పరీక్షలు ఒకే పర్యాయం నిర్వహించడంతో అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం డీఎస్సీని వాయిదా వేసేవిధంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, కోట్ర శ్రీనివాసులు, గంగోజి, నిరంజన్‌యాదవ్, రామకృష్ణగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీరామ్

కోడేరు: మండంలలోని ఎత్తం పీఎస్‌సీఎస్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు చేసేటపుడు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలన్నారు. కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎరువుల నమునాల పరీక్ష కోసం హైదరాబాద్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఏఈఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏకలవ్య పాఠశాలల్లో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాలు, ఆధార్‌నంబర్ అడిగితే చెప్పొద్దన్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. బాలశంకర్ రెడ్డి, భాస్కర్, చంద్రోశేఖర్, రవి ఉన్నారు.

ఆంగ్ల సబ్జెక్టు బోధనపై అవగాహన



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొల్లాపూర్ డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులకు ఆంగ్ల సబ్జెక్టు బోధనపై అవగాహన తరగతులు నిర్వహించారు. జాలీ లెర్నింగ్ అనే సంస్థ ద్వారా జాలీ ఫోనిక్స్ విభాగానికి చెందిన శిక్షకులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు ఆంగ్లం సబ్జెక్టును సులభతరంగా బోధన మెళకువలను వారు వివరించారు. ఆంగ్లంపై పట్టు పెంచుకుంటే విద్యార్థులు చదువులో రాణించగలరన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఇమ్మానుయేల్, కాంప్లెక్స్ హెచ్ఎంలు వనజ, శోభారాణి, కురుమయ్య, శిక్షకులు అంజలి, గౌరీ, సుమంత్ తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



దాతలు ఇచ్చిన నోటు పుస్తకాలతో విద్యార్థులు

తెలకపల్లి: మండలంలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బొక్కర గ్రామానికి చెందిన దార జంగయ్యజ్యోతి దంపతులు బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రిని వితరణ చేశారు. మొత్తం రూ.రూ.12 వేలు విలువ చేసే నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, పలకలను 78 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జైపాల్, పాఠశాల చైర్మన్ మంజుల మాట్లాడుతూ దాతలు ఇచ్చిన సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలో రాణించాలి

వెల్దండ: యువత స్వయం ఉపాధిలో రాణించాలని మాజీ ఎంపీపీ జయప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని అంకమోని కుంట గ్రామానికి చెందిన ఓర్సు నరసింహ నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను మాజీ ఎంపీపీ జయప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన వారు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధితో ఎదగాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలను అందించి ప్రొత్సహించాలన్నారు. సమయాన్ని వృథా చేసుకోవొద్దని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రజా సంఘాల ర్యాలీ



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల సభ్యులు

కొల్లాపూర్: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే పురస్కరించుకొని బుధవారం ప్రజా సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సంక్షేమం కోసం పాలక ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సలీం, బత్తిని రాజు, నీరజ, మాధవి, నిర్మల తదితరులున్నారు.

ఎంఈఓకు వినతి



కల్వకుర్తిరూరల్: పట్టణంలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ బాసునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు సంతోష్ మాట్లాడుతూ సీబీఎస్ఈ అనుమతి లేకున్నా సిలబస్ బోధిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నాయని వివరించారు. ఫీజు నియంత్రణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అర్జున్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం రైతుల హర్షం

తాడూరు: వారం రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచూసిన రైతుల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. వాడుపట్టిన మొక్కలకు జీవం పోసినట్లైంది. రసాయనిక ఎరువుల కోసం సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులు క్యూ కట్టారు. యూరియా, డీఏపీ రైతులకు కావాల్సిన ఎరువులన్ని అందుబాటులో ఉన్నాయని సీఈఓ ఆంజనేయులు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటామన్నారు.